ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడికి యత్నం

● కీర్తిరెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు

భూపాలపల్లి రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు బూటకపు వాగ్దానాలు చేసిన ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేదని నిరసిస్తూ బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. బుధవారం జాగో తెలంగాణ నినాదంతో బీజేపీ నేతలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి యత్నం చేశారు. పోలీసులు ముందస్తుగానే బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ముట్టడి కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొని ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రజలకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని నినాదాలు చేస్తూ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించే యత్నం చేశారు. పోలీసులు చందుపట్ల కీర్తిరెడ్డితో ఆందోళన కారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎరుకల గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నిషేధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కన్నం యుగంధర్, దొంగల రాజేందర్, మంద మహేష్, ఆకుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడికి యత్నిస్తున్న బీజేపీ నాయకులు

లక్ష్యాన్ని మించి మొక్కలు నాటాలి

కాటారం : హరితహారంలో భాగంగా మండలంలో లక్ష్యాన్ని అధిగమించి మొక్కలు నాటేలా ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు వెంటనే జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

నిందితులను కఠినంగా శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కాటారం: మంథని మండలం ఖానాపూర్‌కు చెందిన దళిత యువకుడు మంథని మధుకర్ మృతి కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని పలు ప్రజాసంఘాల నాయకులు పీక కిరణ్, మోతె సాంబయ్య, బుర్రి శివరాజ్, అక్కల బాపు డిమాండ్ చేశారు. కాటారంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మధుకర్‌ను 2017లో కొంతమంది హత్య చేయగా పలువురు జిల్లా అధికారులు ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మధుకర్ ఆత్మహత్య చేసుకుంటే శరీరంపై గాయాలు ఎందుకు ఉంటాయని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఈ నెల 31లోపు రీకౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు జిల్లా అధికారులను ఆదేశించినప్పటికి వారు ఈ కేసు విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

పాఠశాల ఆవరణలో వర్షపు నీరు

మల్హర్: మండలంలో కొయ్యూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి బుధవారం తెల్లవారుజామున వర్షం పడడంతో నీరు చేరింది. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలను అధికారులు అభివృద్ధి చేశారు. అయితే స్కూల్ ప్రదేశంలో పూర్తి స్థాయిలో మొరం నింపక పోవడంతోనే వర్షం కురిసినప్పడల్లా నీరు నిలుస్తుందని పలువురు తెలుపుతున్నారు. స్కూల్‌ను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, జిల్లా ఎస్టీ ప్రధానకార్యదర్శి సవేందర్ పరిశీలించి, పల్లం ఉన్న చోట మొరంతో నింపాలని పీఆర్‌ఏఈని కోరారు. దీనిపై పీఆర్‌ఏఈ అశోక్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో ఎర్రమొరం పోయించి నీరు నిల్వకుండా చేస్తామని పేర్కొన్నారు.


స్కూల్ ఆవరణలో నిలిచిన నీరు

నిందితుడిని అరెస్ట్ చేయాలి

కాటారం: మహాముత్తారం మండలం సీతంపేట సర్పంచ్ నగేశ్‌ను కులంపేరుతో దూషించిన సంఘటనలో అట్రాసిటీ కేసు నమోదైన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జయశంకర్ జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన దళిత సర్పంచ్ నగేశ్ జూలై 24న గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు నిర్వహిస్తుంటే రాజమల్లు నగేశ్‌ను కులం పేరుతో దూషించడంతో పాటు అసభ్యపదజాలంతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. దీంతో సర్పంచ్ సదరు వ్యక్తిపై అట్రాసిటీ కేసు పెట్టడంతో పోలీసులు విచారణ సైతం చేపట్టి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదై 30 రోజులు గడుస్తున్న నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గుర్రం దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, జిల్లా కమిటి సభ్యులు పొట్టన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలిచిన మహావీరుడు పాపన్నగౌడ్

భూపాలపల్లి రూరల్ : అన్యాయాలను పెత్తందారి వ్యవస్థను అణిచివేసి పేద ప్రజల పక్షాన నిలబడ్డ ఒక మహావీరుడే సర్వాయి పాపన్న అని ఆ రోజుల్లోనే ముస్లిం రాజుల పైనే ఎదిరించి యుద్ధం చేసి ఢిల్లీ కోటను సైతం రాజ్యాన్ని ఆక్రమించిన ఒక మహావీరుడని ధర్మసమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు కొత్తూరి రవీందర్ కొనియాడరు. సర్వాయి పాపన్న 373 వ జయంతి వేడుకలను ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అంబేడ్కర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ ఆదేశాల మేరకు సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఈ నెల18 నుంచి 24 వరకు జరుపుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగానే బుధవారం సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కండె రవి, రవీందర్, స్వామి, నరసింహ, అశోక్, దశరథం, మహేష్, సుభాష్, రమణాకర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: సీం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్ధాలుగా ప్రత్యేక రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారులను వదిలి ఇతరులకు టికెట్లు కేటాయించడం సరైంది కాదన్నారు. వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం, ఆత్మహత్యలు చేసుకున్న వారిపై నిర్లక్ష్యం వహిస్తున్న ఎమ్మెల్యేకి మళ్లీ టికెట్ ప్రకటించడంపై బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకోవడంలో అర్థమే లేదని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, నల్లబెల్లి విజేందర్, ఎంబాడి రాజమల్లు, పెరుమాండ్ల రాజు, ప్రకాష్, పైడి, కొల్గూరి అనిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

మహాముత్తారం/కాటారం: మండలంలోని ములుగుపల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కీర్తి సత్యం 15 ఏళ్లక్రితం కాటారం మండలం దన్‌వాడలో నివాసం ఉంటు గ్రామస్తులకు వైద్యసేవలందిస్తున్నాడు. వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని వైద్యసేవలను గుర్తించి గ్రామానికి చెందిన యువత, గ్రామస్తుల ఆధ్వర్యంలో రూ.41,500 జమ చేసి బుధవారం గ్రామయువకులు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

వెంకటాపురం(కె): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా మండల మహిళ సమాఖ్య కృషి చేయాలని సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వేణు గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య 15వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాలు, మండల సమాఖ్య ల సహకారంతో ఆర్థికంగా ఎదిగేలా మండల సమాఖ్య, సెర్ప్ సిబ్బంది కృషి చేయాలని అన్నారు. అనంతరం గత సంవత్సరం ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పూనెం లక్ష్మి, కార్యదర్శిగా తాటి బుచ్చమ్మ, కోశాధికారిగా పాయం సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలిగా బద్ది రాజేశ్వరి, సహాయ కార్యదర్శిగా పూసల మల్లక్కలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎం అనిల్, ఏపీఎం కరుణాకర్ సీసీలు నర్సయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సుమన్

చిట్యాల: ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుమన్ పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువును మధ్యలో ఆపేసిన, చేతి వృత్తులు చేసుకునే వారికి ఓపెన్ స్కూల్ ఒక వరమని అన్నారు. ఆసక్తి గల వారు అపరాద రుసుంతో ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మూరాల శంకర్ రావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు బుర్ర సదయ్య, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

సంపద వనాలను కాపాడాలి


నైన్‌పాకలో సంపదవనంలో ధరమ్‌సింగ్

చిట్యాల: సంపద వనాలను కాపాడాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని ఒడితల, నైన్‌పాక గ్రామాల్లోని సంపద వనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంపద వనాలపై నిర్లక్ష్యం వహించకుండా కాపాడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రామయ్య, ఏపీఓ హలీం, సర్పంచ్‌లు సాంబారి లక్ష్మీభద్రయ్య, తొట్ల లక్ష్మీఐలయ్య, ఈసీ, టీఏ, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికుమార్

మంగపేట: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై రవికుమార్ అన్నారు. మండలంలోని కమలాపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని, విద్యార్థులకు బాలల చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పిల్లలపై అఘాయిత్యాలు జరిగిన సమయంలో భయభ్రాంతులకు గురవకుండా వారి తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు, బంధువులకు వెంటనే సమాచారం చేరవేయాలి. బాల్యం, కౌమార దశలో ఉన్నప్పుడు పిల్లలు చెడు వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మహిళా కానిస్టేబుల్ రోజా మాట్లాడుతూ పోక్సో వంటి నేరాలకు సంబంధించిన వివరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలను వివరించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్ చేయాలని, పిల్లల హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలను తెలిపే బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మోహన్, ప్రసాద్, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

కాటారం : మంథని నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా టికెట్ ఆశించి భంగపడిన తాను త్వరలో తన భవిష్యత్ కార్యాచరణ ప్రజలకు తెలుపుతానని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో సర్పంచ్, మార్కెట్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ, పీఏసీఎస్ చైర్మన్ పదవుల్లో కొనసాగానని తెలిపారు. మంథని నియోజకవర్గ ప్రజలు తనను హత్తుకొని గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందని నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం



మొగుళ్లపల్లి : మండలంలోని కొర్కిశాల గ్రామానికి చెందిన వైనాల సతీష్ తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకొని సతీష్‌తో చదువుకున్న పదో తరగతి స్నేహితులు సతీష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.అందజేసిన వారిలో గంగిశెట్టి శ్యాం, మధుసూదన్, రాజు, ఓదెలు, రమేష్, కరుణాకర్, ప్రసాద్, రాజేందర్ తదితరులు ఉన్నారు

కారు, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

ఏటూరునాగారం: కారు, ఆటో ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలోని జీడివాగు వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కారు యజమాని ఇర్సవడ్ల రాజేష్, రాధాకృష్ణ ఇద్దరు కలిసి కారులో కమలా పురం నుంచి ఏటూరు నాగారం వస్తున్నారు. ఏటూరునాగారం గ్రామానికి చెందిన ఫెరోజ్ ప్రయాణికులతో కలిసి మంగపేట నుంచి ఏటూరునాగారం వస్తుండగా ముందు ఆటో వెళ్తుండగా వెనుక నుంచి కారు బ్రేక్‌ఫెయిల్ కావడంతో ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న తాళ్ల గడ్డకు చెందిన శీలం రాజేశ్వరి, మద్దెల లక్ష్మి, ఆటో డ్రైవర్ ఫెరోజ్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిలో 108లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వరంగల్‌కు రెఫర్ చేసినట్లు స్థానిక వైద్యులు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలను సేకరించారు.

27న పద్మశాలి వివాహ పరిచయ వేదిక

భూపాలపల్లి రూరల్ : పద్మశాలి (ఎస్‌ఆర్‌బి) వివాహ పరిచయ వేదిక తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 27న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్‌లింగంపల్లిలో 1:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని పద్మశాలి కుటుంబాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి

టేకుమట్ల: డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని గోవా బీజేపీ ఎమ్మెల్యే ఉల్హాస్‌తూనేకర్ అన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు సత్యపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కాసర్ల అరవింద్ రెడ్డి అధ్యక్షతన మండలంలోని పంగిడిపల్లి అమ్మ గార్డెన్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు అనే పునాదిపై సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షతో ఏర్పడిన తెలంగాణ నేడు కుటుంబ పాలనలో చిక్కుందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర ఉందని, నాడు కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోకన్వీనర్ రవికిరణ్, మండల ప్రధాన కార్యదర్శులు గుర్రపు నాగరాజు, బండారి సమ్మయ్య, మూడెత్తుల కొమురయ్య, గూడెపు వెంకట్‌రెడ్డి, రఘుపతి, చిలుక రమేష్, దామోదర్‌రెడ్డి, నరేందర్, పారిపెల్లి మహేందర్, సోషల్ మీడియా కన్వీనర్ రాంచందర్ రావు, శ్రీపతి రవి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నేత సత్యపాల్‌రెడ్డి

ఆశలకు కనీస వేతనాలు అందించాలి

● మద్దతు తెలిపిన ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం కనీస వేతనం అందించాలని స్థానిక ఎమ్మెల్యే సీతక్క అన్నారు. బుధవారం ఆశ కార్యకర్తలు డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ముట్టడి చేపట్టగా మద్దతు ప్రకటించి ఆమె మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించినా ఆశలను పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, మండల కార్యదర్శి అమ్జద్‌పాషా, గుండబోయిన రవిగౌడ్, నీలాదేవి, మంజుల, సంధ్య, మాధవి, జ్యోతి, నాగమణి, సరిత, రాజ్యలక్ష్మి, మధు, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

జేసీబీ సాయంతో మోటార్ల వేట

మల్హర్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇసుక కుప్పలోకి కూరుకుపోయిన మోటార్ల కోసం రైతులు జేసీబీ సహాయంతో వేట మొదలుపెట్టారు. మండలంలోని తాడిచర్ల, మల్లారం, వల్లెకుంట, కుంభంపల్లి మానేరు పరివాహక ప్రాంతంలోని పొలాలకు సంబంధించిన మోటార్లు, పైపులు కొట్టుకపోగా, మరికొన్ని చోట్ల ఇసుక కుప్పలతో నిండి పోయాయి. దీంతో వల్లెకుంట మానేరు పరిధిలో రైతులు జేసీబీసాయంతో వెతికారు. పలుచోట్ల మోటార్లు లభించినప్పటికీ మోటర్, పైపుల్లోకి భారీగా ఇసుక చేరడంతో పనికి రాకుండా పోయాయి. మానేరు ప్రాంతంలో మోటార్ ఏర్పాటుకు రూ.60 వేలకు ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు.


మోటార్లను వెలికితీస్తున్న జేసీబీ

క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



మంగపేట: తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బైరి వీరస్వామిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలబొకే అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయరాంరెడ్డి, యానయ్య, నాగేంద్రబాబు, భగవాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేష్, నర్సయ్య, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ములుగు రూరల్ : జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతికి ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ ములుగు పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు రాజాహుస్సేన్, మెండయ్యగౌడ్, రమేష్, రమేష్‌రెడ్డి, యశ్వంత్, మహేందర్, నాజర్‌ఖాన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి




వెంకటాపురం(కె): భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం సైనికుల్లా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ ప్రతాప్ సింహ, నాయకులు శ్రీనాధరావు, శేఖర్, నర్సింహారావు, చిట్టెం ఈశ్వరావు, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



వెంకటాపురం(కె): మండల పరిధిలోని పర్సిక గూడెం పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడిని నియమించి గిరిజన విద్యార్థులకు విద్యను దూరం చేసిన ఐటీడీఏ విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని బర్లగూడెం సర్పంచ్ కోర్సా నర్సింహమూర్తి అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను అధికారులు వేరే పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించి ఒక్క ఉపాధ్యాయుడిని మాత్రమే ఉంచారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచ్ సహకారంతో సొంత ఖర్చులతో విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేయాలని విద్యాకమిటీ తీర్మాణం చేసింది.

మరమ్మతులు చేపట్టాలి



వెంకటాపురం(కె): మండలంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లను ప్రభుత్వం తక్షణమే మరమ్మతు చేయించాలని కోరుతూ స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహం సమీపంలోని ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు, వెంకటాపురం సొసైటీ చైర్మన్ చిడెం మోహనరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఎదిర నుంచి మండల కేంద్రం వరకు రోడ్లు పెద్ద సంఖ్యలో దెబ్బతిని గుంతలమయంగా మారాయని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతదేవి, నాయకులు చిడెం శివ, క్రాంతి, సరస్వతి, సాగర్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410